

గోవిందరాజు సీతాదేవి

చట్టాన్ని గౌరవించాలని చెప్పే, కానీ...

హైదరాబాద్ పాతనగరంలో కర్ఫ్యూతో బైటముఖం చూడకుండా యిళ్ళలో మగ్గుతూన్న సామాన్య కుటుంబీకులు పాలకి, నీళ్ళకి నిత్యావసర వస్తువులకి కటకటపడుతూ ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకుని ఒక్కొరోజూ గడుపుతూన్న రోజుల్లో ఒకరోజు తెల్లవారుతూ వుంది. తూర్పునుంచి సూర్యుడు మెల్లగా పైకి వస్తున్నాడు. ఒక్కొ ఇల్లు తలుపు కొద్ది కొద్దిగా తెరుచుకుంటూ వుంది. ఈ పాత నగరంలో ఇరుకుగల్లీలో దాదాపు పాతికేళ్ళనుంచీ అద్దెకి వుంటున్న సూర్యకాంతమ్మ యిలాంటి కర్ఫ్యూలను యెన్నింటినో చూసింది. భయపడింది. అయితే అక్కడే వుండక తప్పకపోవటానికి కారణం కేవలం పదిహేను రూపాయలకి రెండు చిన్నచిన్న గదులు దొరకటం. కొత్తనగరంలో యెన్ని మార్పులు వచ్చినా పాత బస్తీలో యే మార్పూ రాకపోవటం అద్దె పెరక్కపోవటంవల్ల అక్కడ వుండక తప్పలేదు.

భర్త మతకల్లోలాల్లో సంబంధంలేకున్నా ఆఫీసునించీ వస్తూ దుండగుల బారినపడి చావుదెబ్బలు తిని ప్రాణాలు వదిలాడు.

తండ్రి పోయేనాటికి సరళకి ఇరవై యేళ్లు. బీకాం పూర్తిచేసి టైపు నేర్చుకుంటూ వుంది సూర్యకాంతమ్మకి సరళ తర్వాత యిద్దరబ్బాయిలు. వాళ్ళు యిప్పుడు కాలేజీ చదువులకి వచ్చారు గానీ తండ్రి పోయే నాటికి చిన్నవాళ్ళే. గవర్నమెంట్ కనిక రించి సూర్యనారాయణ పోతే ఆయన కూతురు సరళకి ఓ గుమాస్తా వుద్యోగం యిచ్చింది. అప్పటినుంచీ సూర్య కాంతమ్మ కూతురి సంపాదనమీద బ్రతు కుతోంది. తమ్ముళ్ళని యెంత జాగ్రత్తగా చూస్తూన్నా క్రమశిక్షణలో పెంచుతూన్నా ఆ పాత బస్తీల్లో వుండే ఆకతాయి కుర్రాళ్లతో స్నేహం సాగిస్తూనేవున్నారు. యీ స్నేహాలు యెలాంటి వుపద్రవాలకి దారితీస్తాయో అని సరళ లోలోపల భయ పడుతూనే వుంటుంది. యిలా రోజులు దొర్లిస్తూన్న సరళకి వయసు పాతిక దాటింది. అయినా సరళ బాధపడటంలేదు. తమ్ముళ్ళ భవిష్యత్ బాగుంటే చాలన్నదే ఆమె కోరిక.

రెండు రోజులుగా పాతనగరంలో అల్లర్ల కారణంగా కర్ఫ్యూ అమలులో వుంది. ఇందువల్ల ఇంట్లోనే వుండి పోవాల్సిరావడం చాలా చిరాకుగా వుంది సరళకి. ఈ పాత ఇంట్లో గాలీ వెల్తురుకి కరువు. యిక్కడే తన బాల్యం గడిచి పోయింది.

వచ్చీరాని వయసులో యెన్నెన్నో కలలు కన్నది. కాశీమజిలీ కథల్లాంటి కలలు. రాజకుమారుడులాంటి అందగా డైన హీరో గుర్రంమీద కాకుండా పెద్ద కారులో వచ్చి తనకోసం వాకిట్లో నిల బడతాడన్న 'ఆశ' చాలా సంవత్సరాల వరకూ పోలేదు రోడ్డుమీద అందమైన శ్రీమంతుడైన యే యువకుడు కన్పించినా తనవైపు చూస్తాడనీ చూసి తన అందా నికి ఆకర్షితుడై చిరునవ్వు నవ్వి కారు తలుపుతెరిచి 'రండి! యెక్కడికి వెళ్లాలి. నేను ఆపుతాను. ఎక్కండి గారు' అని అన్నట్లే భ్రమపడింది నాలుగైదుసార్లు. ఆ భ్రమలో పిచ్చిదై ఆ కారునీ అందు లోని హీరోనీ చూస్తూ పక్కనించి పోతూన్న స్కూటర్ కింద పడబోయింది. ఒకసారి గీసుకుపోయింది కూడా ఒక సారి రిక్షాకిందపడి దెబ్బలుతగిలి రిక్షావాడి బూతులు విని చీరెకి ఒంటికి అంటిన దుమ్ము దులుపుకుని లేచి కుంటుకుంటూ ఇల్లుచేరింది. వేడినీళ్ళకాపు తల్లి శాప నార్థాలూ యివీ తనకి దక్కింది. అంతే సరళ కలలు కనటం మానేసింది. సరళకి రోజూ వుదయం అయిదింటికే మెలకువ వస్తుంది. కానీ పక్కమీదనుంచి లేవదు. లేస్తే అప్పటినుంచీ చేసేందుకు పని వుండదు. పోనీ కదా అని లేచి వాకిలి ముందున్న కాస్త ఖాళీస్థలంలో కూర్చుం దాం అని వస్తే పక్కవాటాలో కాపురం వుంటూన్న పీలకంఠం వెకిలిగా నవ్వుతూ కన్పించి పలకరిస్తాడు.

"ఏం, సరళా అప్పుడే లేచావు.

యేమిటి విశేషం?"

తను జవాబు చెప్పదు.

"రాత్రి నిద్రపట్టలేదా?"

....

"కల్లోకి నే వచ్చానా?"

"... ....

"నా కలలోకి నువ్వు వచ్చావు. యెలా వచ్చావో చెప్పనా పెళ్ళికూతురై నా మెడలో వరమాలవేసి చెయ్యిపట్టుకుని నాతో కలిసి ఏడు అడుగులు వేశావు పెళ్ళికూతురిగా నువ్వు యెంత బాగున్నావో చెప్పనా."

"అక్కరలేదు. నా కలాంటి కలలు రావు. నీ కొస్తే ఆ బాధ్యత నాది కాదు."

ఖచ్చితంగా చెప్పేస్తుంది. అయినా అతను సరళమాట వినడు.

"సరళా నీకోసం మూడు తులాల బంగారం దాచివుంచాను. నీ యిష్టం ఆలోచించుకో"

"ఇద్దరు పెళ్ళాలు చచ్చినా నీ కింకా పెళ్ళిపిచ్చేనా" అసహ్యంగా చూస్తుంది సరళ.

"వాళ్ళ ఖర్మకాలి వాళ్ళు ఛస్తే నా ఖర్మం కాలిందీ బ్రహ్మచారిగా వుండటానికి చెప్పు. నాకేం తక్కువ. నీ కంటే యిరవై యేళ్ళగా పెద్దవాడిని."

సరళ అక్కనుంచి లేచి లోపలికి వచ్చేస్తుంది.

"పీడెంత జిడ్డుగాడు. తన అయిష్టాలు యింత స్పష్టంగా చెప్పినా వదలడే? ఎలా పీడనుంచి తప్పించుకోవాలి" ఆలోచించి ఆలోచించి అలసిపోతుంది గానీ ఆలోచన తట్టదు.

ఈ నీలకంఠం ఒట్టి నక్కగాడు. అమ్మదగ్గర అతి వినయం నటిస్తూ అతి మావం సంపాదించుకుంటున్నాడు.

ఈ ఇల్లు ఖాళీచేసి దూరంగా పోదాం అమ్మా అని తను యెన్నోసార్లు అడిగింది. ఆవిడ ఒప్పుకోలేదు.

'ఈ అద్దెలో మనకి మరెక్కడా ఇల్లు దొరకదమ్మా.' అంటుంది అంతే.

అసలే రాబడికి ఖర్చుకీ అందని ఆర్థిక పరిస్థితి.

'తప్పదు యింకా కొన్నాళ్ళు యిలా యిక్కడే ఈ మురికికూపంలోనే కాలం వెళ్ళదీయక తప్పదు' అనుకుంటూ స్నానం పూర్తిచేసి ట్రాన్సిస్టర్‌లో వార్తలు విని 'యివాళ ఆఫీసు వుంది' అనుకుని తమ్ముళ్ళని యిద్దరినీ కాలేజీకి వెళ్ళండని చెప్పి తల్లి వడ్డించిన అన్నం కంచంముందు కూర్చుంది.

రెండుముద్దలు తినలేదు. యింతలో యెదురింట్లోనించి పెద్దగా యేడుపులు వినిపించసాగాయి. ఏమిటో తల్లి వెళ్ళి కనుక్కుని వచ్చింది.

నిన్న జరిగిన అల్లర్లలో వాళ్ళ అల్లుడు చచ్చిపోయాడట.

"వార్త యివాళ తెలిసింది" సూర్యకాంతమ్మ మామూలుగా చెప్తోంది.

కానీ సరళకి అన్నం తినబుద్ధి కావటం లేదు. మనసు యేదోలా అయిపోయింది.

యెదిరింటిలోవారి అమ్మాయి 'శోభ'కి పెళ్ళిఅయి నెల కాలేదు. అప్పుడే ఆ పిల్ల జీవితం యిలా అయిందా అని బాధ.

సరళ చెయ్యికడిగి లేచింది.

"అదేమిటే" తల్లి కోపంగా చూసింది.

"ఈ పరిసరాల్లోని పరిస్థితులు వింటూ నేను యిక్కడ వుండలేనమ్మా. ఏరోజూ భయమేకదా! ఇక్కడ ఎప్పుడు గలాటా జరిగినా మనం ప్రాణాలు అరచేత్తో పట్టుకుని దాక్కోవాలి ఏం జీవితం యిది. యిక్కడ బ్రతకటంకంటే వూరికి దూరంగా యే చెట్టుకింద వున్నా మనశ్శాంతిగా వుంటుందేమో."

"నిజమే...కానీ మరేదీ దారి" ఆవిడ కళ్ళలో నీళ్ళు సుళ్ళు తిరిగాయి.

సరళ తల్లిని చూస్తూ తనలో తనే బాధపడసాగింది.

"నాన్న గుర్తుకి వచ్చాడు" అనుకుని తల్లిని ఓదార్చి బ్యాగ్ తీసుకుని బస్ స్టాండ్‌కి వచ్చింది.

సిటీబస్‌లు చాలా రద్దీగా వున్నాయి.

యెలాగో బస్‌యెక్కి అఫీసు చేరుకుంది.

'అమ్మయ్య' అనుకుని డ్యూటీలో పడిపోయింది. అంతే సరళకి టైము తెలియదు.

2

సరళ ఆఫీసునుంచి ఇంటికి బయలుదేరింది. సమయం ఆరుగంటలు కావస్తూ వుంది. తగని రద్దీగా వున్నాయి రోడ్డూ బస్సులూ. సిటీబస్‌కోసం నిలబడిన సరళ అలవాటుగా తల పక్కకి తిప్పి చూసింది.

"హలో బాగున్నారా" గోవిందరావు తన మిరపకాయ బజ్జీల వ్యాపారం జోరుగా సాగిస్తూనే సరళని పలకరించాడు.

"వూ" నవ్వింది సరళ.

గోవిందరావు బీకాం ఫెయిల్ అయాడు. యే వుద్యోగమూ దొరక్క డబ్బు సంపాదనకి యే వ్యాపారం అయితేనేం అని యీ వ్యాపారం మొదలెట్టాడు. ఈ వ్యాపారం బాగానే సాగుతోంది. లాభంకూడా వస్తోంది అంటూ కబుర్లు చెప్తూంటాడు. ఆఫీసునించి యింటికి వెళ్ళేప్పుడు ఓ పావుగంట అయినా యితనితో కబుర్లు చెప్తేగానీ మనసుకి బాగుండకపోవడం ఓ పెద్ద అలవాటు అయి కూర్చుంది సరళకి.

ఈ విషయం అతనితో అంటే అతను పెద్దగా నవ్వి—

"నాకూ అంతే సరళగారూ. మిగతా సమయాల్లో యెక్కడెక్కడ తిరిగినా మీరు అఫీసునించి ఇంటికి వెళ్ళే సమయానికి యిక్కడుండాలని అనిపిస్తుంది" అంటాడు.

"నిజమా" ఆశ్చర్యంగా చూస్తుంది సరళ.

అతను మళ్ళీ నవ్వేస్తాడు. యిలా మాటల్లో యెన్నెన్నో విషయాలు దొర్లిపోతూవుంటాయి వారిద్దరి మధ్యనా. సరళ యెక్కడ వుండేదీ ఏ వుద్యోగం చేసేదీ ఎవరెవరు వుండేదీ అడిగి తెల్సుకున్నాడు.



అతను, అతని వివరాలూ యథాలాపంగానే అడిగింది సరళ.

అతనూ అతని పదేళ్ళ చెల్లీ అరవై యేళ్ళతల్లీ మాత్రమే వున్నారని చెప్పాడు.

ఇలా వీరిద్దరి పరిచయం క్రమ క్రమంగా పెరగసాగింది.

సరళని చూస్తూనే నవ్వుతూ పల్కరిస్తాడు గోవిందరావు

"కులాసాగావున్నార?" ఈ పల్కరింపుకి సరళ మనసు గమ్మత్తుగా స్పందిస్తుంది.

"నిన్న చూసి ఈ రోజు మళ్ళా అప్పుడే 'కులాసానా' అని పల్కరిస్తారేమిటీ" అంది ఓసారి.

"బలేవారే. నిన్నమంచి నేటికి అంటే ఇరవైనాలుగ్గంటలు. ఇంత సమయంలో యెన్నెన్ని సంఘటనలన్నా జరగవచ్చు."

"మాలాంటివాళ్ళ జీవితాల్లో అంత వేగంగా మార్పులు రావండీ"

"ఎందుకు రావు. మీకు ప్రమోషన్ రావచ్చు. యింకా యింకో చాలా జరగవచ్చు. ఏ అబ్బాయి అన్నా నచ్చవచ్చు. మీకు పెళ్ళి కుదరవచ్చు."

సరళ నిర్లిప్తంగా నవ్వింది.

"జవాబు చెప్పండి" కవ్విస్తున్నట్లు అడిగాడు.

"ఆ విషయం దాదాపు మర్చిపోయాను. ఎందుకంటే మాలాంటి స్థితిలోనివాళ్ళకి పెళ్ళికావటం అన్నది చాలా కష్టమైన విషయం అని"

"భలేవారు. అలా నిరాశపడకూడదు. భవిష్యత్తులో యేం జరుగుతుందో మనం చెప్పలేం కదూ. కనుక 'ఆశ'ని చంపకూడదు.

సరళ యింక ఆ మాట మార్చాలని చూసింది. కానీ అతను వదల్లేదు.

"నాకు చెప్పండి. మీకు యెలాంటి పెళ్ళికొడుకు కావాలి."

"చదువు వున్నా లేకున్నా డబ్బు సంపాదించి నన్ను బాగా చూసుకునే వాడు యెవరైనా సరే దొరికితే నేను చేసుకోవటానికి రెడీగా వున్నాను."

"నిజంగా" అతనికళ్ళు మెరవసాగాయి.

"నిజంగా నిజం. మీలాంటి ... మీలాంటి..." సరళ మాట పూర్తిచేయకుండానే బస్సు వచ్చేసింది. అంతే దాన్ని వదులుకుంటే మరో బస్ గంటవరకూ లేదు అని త్వరగావచ్చి రద్దీగా వున్నా యెక్కేసింది.

ఇది జరిగినతర్వాత మళ్ళా యిద్దరూ కలుసుకోలేదు కర్ఫ్యూకారణంగా. తిరిగి యివాళ కల్సుకున్నారు. సరళ బండీ దగ్గరగా వచ్చింది. గోవిందరావు వేడివేడి బజ్జీలు నాలుగు ఆకులో పెట్టి యిచ్చాడు.

"క్షేమంగా వున్నారు కదూ. అసలే మీరుండేది పాతబస్తీలో అని చాలాచాలా వరిపడిపోయాము" తనవ్యథ చెప్పసాగాడు గోవిందరావు.

సరళ బజ్జీలు తింటూనే జవాబు చెప్ప సాగింది.

"ఇలా సిటీలో గందరగోళం యేర్పడ్డప్పుడల్లా మీ వ్యాపారం దెబ్బ తింటుందా."

"తింటుంది. అయితే నేను గలాటా జరిగే యేరియాలకి దూరంగా వుండేలా చూసుకుంటూ వుంటాను. అయినా కాస్తా కూస్తా నష్టం వస్తూనే వుంటుంది ఇవన్నీ సరే, ఓ విషయం మీకు చెప్పాలనుకుంటున్నాను. అది యేమిటంటే నేనిలా ఈ బజ్జీల బండీకాక ఓ షాపు చిన్నది అమ్మకొంది అద్దెకి తీసుకుని ఈ బజ్జీలతోబాటు మరికొన్ని స్వీట్లు కూడా పెట్టాలని ప్లాను చేసుకున్నాను. చిన్న గది దొరికింది. దాన్ని మీరు ప్రారంభించాలని కోరుతున్నాను."

"నేనా" ఠలేవారు. ఏ మంత్రిగారి నన్నా సినిమాస్టారునన్నా పిలవండి బాగుంటుంది."

అలాంటివాళ్ళు నాకు అక్కరలేదు. మీరు కాదు అనటానికి వీల్లేదు. శనివారం ఉదయం పదిన్నరకి బాగుందని చెప్పాడు సిద్ధాంతి. వస్తారు కదూ" అంటూ తను తీసుకున్న షాపు యెక్కడో యెలా రావాలో గుర్తులు చెప్పాడు.

సరళ ఆలోచిస్తూ వుండిపోయింది.

"ఏం మీ ఇంటికివచ్చి పిలవలేదని అభ్యంతరమా! అయితే చెప్పండి అలాగే వస్తాను."

"కాదు. మీరు రానక్కరలేదు. నే వస్తాను."

గోవిందరావు ఆనందానికి అంతులేదు.

"తప్పక రావాలి. మర్చిపోకండి" సరళ బస్ వస్తూంటే దాన్ని చూస్తూ మరో సారి చెప్పాడు.

"అలాగే" అంటూ బస్ ఎక్కబోతూ యెందుకో తలతిప్పి చూసింది. అక్కడ నీలకంఠం తన్నే చూస్తూ నిలుచున్నాడు. అతని కళ్ళు యెర్రగా నిప్పుల్లా వున్నాయి.

సరళ గుండె దడదడ లాడింది. యెలాగో బస్ యెక్కింది. అతనూ బస్ యెక్కాడా లేదా అని చూసింది. అతను కన్పించలేదు. నీలకంఠం చాలాసార్లు తనూ-గోవిందరావు మాట్లాడటం చూశాడని సరళకి తెలియదు.

సరళ ఇంటికివచ్చింది. కానీ మనసుకి శాంతిగా లేదు.

3

సూర్యకాంతమ్మతో నాలుగిళ్ళ అవతల వుండే యాదమ్మ వచ్చి చెప్తోంది.

"సూర్యకాంతమ్మా 'శోభ' మొగుడిని పంపిన ఓళ్ళని యీళ్ళు యెళ్ళి పంపిచ్చినారంట. అక్కడ పెద్ద గలాటా అయిందంట. మళ్ళా ఆళ్ళు యీళ్ళని పంపుతారు, ఇంతేగా" యాదమ్మ వెళ్ళిపోయింది.

"దేవుడా యీ ప్రతీకారాలకి ముగింపు యెప్పుడు" సూర్యకాంతమ్మ మనసులో అనుకుంది.

"అమ్మా తమ్ముళ్ళు యింకా ఇంటికి రాలేదూ" అడిగింది.

"రాలేదమ్మా....నేనూ వాళ్ళకోసమే చూస్తున్నాను."

"త్వరగా రమ్మని చెప్పలేదూ"

"చెప్పాను. వాళ్ళకి నా మాటంటే ఖాతరెక్కడిదే."

సరళ బట్టలు మార్చుకుని కూర్చుండిపోయింది.

కరెంటుపోయింది. గాలి లేదు తల్లి యేదో చెప్పాలని ప్రయత్నిస్తున్నట్లు అర్థమై "యేమిటమ్మా అది" తనే అడిగింది.

"నీ పెళ్ళి గురించే నాకు దిగులుగా వుందమ్మా నీ తమ్ముళ్ళా చిన్నవాళ్ళు. రోజులు చూస్తే బాగాలేదు. ఆడవాళ్ళం ఒంటరిగా బ్రతకలేం. మనకో మగాడి అండ కావాలి. యివన్నీ కలిపిచూస్తే ఆ నీలకంఠం . తప్ప మనకి ఎవరు దొరుకుతారు చెప్పు. అతనికి మూడో పెళ్ళే అనుకో. ఆ విషయం మనం ఆలోచించటం మానేస్తే మిగతావి బాగానేవుంది. అతనిదగ్గర డబ్బుంది. నలుగురు తన్నటానికి వచ్చినా భయపడడు యెదురు తన్ని వస్తాడు."

"అమ్మా! నాకు పెళ్ళి కాకున్నా పర్లేదు. కానీ నీలకంఠాన్ని చేసుకోను. మనకి మగాడి అండే కావాలంటే యింకెవరి అనరా అయినా తీసుకుందాం కానీ నీలకంఠంలాంటి గుండా చేతుల్లో చిక్కపడకూడదమ్మా."

"సరళా యిక్కడ బ్రతకాలంటే యింకేదారీ లేదే."

"వుంది. కొత్తదారి వుంది. మనం యిక్కడినుండి దూరంగా వెళ్ళిపోదాం. డబ్బుకి యిబ్బంది అయినా అర్థాకలితో

వుందాం. కానీ నీలకంఠం చేతుల్లో చిక్కవద్దమ్మా. అతను ఇక్కడపుట్టి యిక్కడ పెరిగి తరతరాల కక్షలకీ కార్పణ్యాలకీ వారసుడై కిరాతకుడిలా యెందరిని పరిమార్చలేదు. అయినా చట్టానికి అందకుండా తప్పించుకు తిరుగుతున్నాడు. అతనిలో మానవత్వం లేదు. అతని గుండెలో మతిపిచ్చి ప్రతీకారం ఇవే రగులుతూ వుంటాయి అవి నీకు తెలియదామ్మా. నాన్నని చంపినవాళ్ళలో యితనూ వున్నాడని నీకు తెల్సుకదూ!

సూర్యకాంతమ్మ వెక్కి వెక్కి ఏడవసాగింది

"వాడు దుర్మార్గుడు. వాడి కళ్ళు నీ మీద వున్నాయి. వాటిని కాదని మనం బ్రతకలేమే తల్లీ."

"ఇదే ఇదే పిరికితనం అడదాన్ని అసమర్థురాలిని చేస్తోంది. బానిస మనస్తత్వం పెంచుతోంది."

"సరళా" తల్లి గావుకేక పెట్టింది. సరళ మాటలు ఆపి వెనక్కి తిరిగి చూసింది.

అక్కడ నీలకంఠం నిలబడివున్నాడు.

తమ మాటలు అతను విన్నాడో లేదో తెలియదుగానీ అతని కళ్ళలో యేదో గర్వం కన్పిస్తోంది.

"సూర్యకాంతమ్మా! నీ కూతురు ఏమో అనుకున్నా యిన్నాళ్ళూ. యింక ఒక్క క్షణంకూడా వూరుకోను. చూడూ నాలుగు రోజులే టైము ఇస్తున్నాను. నీ కూతుర్ని యిచ్చి నాకు పెళ్ళి జరిపించావా సరే.... లేకుంటే....నా సంగతి తెల్సుగా. నీ కుటుంబాన్ని సఫాచేసి కాని నిద్దరపోను."

నీలకంఠం కళ్ళు నిప్పుల్లా వున్నాయి ఆ కళ్ళలో సరళని తీక్షణంగా చూస్తూ వెళ్ళిపోయాడు.

4

సూర్యకాంతమ్మ కూతురిని ఇల్లుదాటి బైటకి పోనీయలేదు. మూడవరోజు జరుగుతూ వుంది.

గోవిందరావు స్వీటుషాపు తెరిచేది యీ రోజునే. సరళ తల్లి చూడకుండా బైటపడి ఆటో యెక్కేసింది. గోవిందరావు కొత్తషాపుని సింపుల్‌గా అలంకరించాడు. షాపుముందు ఓ పది కుర్చీలు వేసివున్నాయి. ఆ కుర్చీల్లో కొందరు యువకులు కూర్చుని వున్నారు. టేపు రికార్డులోనించి హిందీ పాటలు విన్పిస్తూన్నాయి. గాజు అల్మారాలో కొన్ని స్వీట్లు అందంగా పేర్చివున్నాయి. ఆటో దిగిన సరళని కుర్చీల్లో కూర్చున్న కుర్రాళ్ళు యెగాదిగా చూడసాగారు. ఆ తర్వాత ఒకతను అడిగాడు. "మీరు సరళగారు కదూ".

"ఔను! గోవిందరావుగారెక్కడ?"

"యిప్పుడే పిలుస్తాం. కూర్చోండి" కుర్చీ చూపాడు.

సరళ కూర్చుంది.

గోవిందరావు వచ్చాడు. కానీ అతను మామూలుగా లేదు. ఎడం చేతికి తలకి కట్లువున్నాయి. కుంటుతున్నాడు.



"ఏమైంది!" సరళ ఆదుర్దాగా అడిగింది.

"తర్వాత చెప్తాను. మీరు కాస్త ఆలస్యంగా అయినా వచ్చారు. అందుకు ముందు థాంక్స్ చెప్తున్నాను రండి. వచ్చి ఈ రిబ్బన్ కత్తిరించండి."

సరళ అతను చెప్పినట్లు చేసింది.

గోవిందరావు పూలదండని సరళ మెడలో వేశాడు స్నేహితులకి ప్యాకెట్లున్న కవర్లు సరళకిచ్చి పంచమన్నాడు. అవి అందుకుని శుభాకాంక్షలు చెప్పి వెళ్ళిపోయారు అందరూ. సరళా గోవిందరావులు కుర్చీల్లో కూర్చున్నారు.

"యిప్పుడు చెప్పండి. మీకీ దెబ్బలు యెలా తగిలాయి."

"ఆ రోజు మీరలా బస్ యెక్కారా. తర్వాత నేను నా వ్యాపారం కట్టిపెట్టి యింక వెళ్ళిపోదామని డబ్బు లెక్క చూసుకుంటూ వుండగా ఓ రౌడీ నామీద వచ్చి పడ్డాడు యెమరుపాటుగా వుండటం వల్ల వాడు కొట్టినదెబ్బలు కొన్ని తగిలాయి. నేను యెదురుదెబ్బ తీసేసరికి వాడు పారిపోయాడు. అయితే అతను నాకు తెలియదు. అయినా నా మీదకి యెందుకు వచ్చాడో అప్పుడు అర్థం కాలేదు. కానీ తర్వాత వాడెవరో నా మీదికి యెందుకొచ్చాడో ఆరా తీశాను విషయం తెల్సుకున్నాను"

"ఎవరతను?" సరళ ఆదుర్దాగా అడిగింది.

"మీ కెందుకులెండి. ఆ విషయం నే చూసుకుంటాను. అసలు ఆ మర్నాడే నా స్నేహితులని వెంటతీసుకుని వాడిపని పట్టాలని అనుకున్నాను. కానీ యివాళ ఈ షాపు ప్రారంభంవుందనీ మీరు వచ్చి తిరిగివెళ్ళటం బాగుండదనీ ఆగాను."

"మీరు కొట్లాటల్లో తలమారుస్తారా."

"దూర్చను. కాని అకారణంగా నామీద కొస్తే ఒదలను"

"మీపీదకి వచ్చినవాడు మా ఇంటి దగ్గరవున్న నీలకంఠమేనా"

"అవును అతనే। నేను మీతో మాట్లాడటం చూసే అలా వచ్చాడని అర్థమైంది నాకు."

"మీరు వాడిజోలికి వెళ్ళకండి వాడు చాలా దుర్మార్గుడు. గూండా రౌడీ పచ్చి నెత్తురు తాగే కసాయివాడు" అంటూ తనని ఎలా బెదిరించాడో తల్లిని ఎలా భయపెట్టాడో చెప్పేసింది

"కనుకనే అలాంటివాడిని వదలకూడదు వీళ్ళ ఆగడాలకి భయపడటం వల్లనే యింకా యింకా రాక్షసత్వం ప్రదర్శిస్తూన్నాడు. ఆ విషయం వదిలేయండి. మీరు మాత్రం ఆ పాత నగరంలో వుండద్దు. వెంటనే అక్కడనుండి దూరంగా వచ్చేయండి. మా ఇంటికి దగ్గరలోనే ఓ గది చూశాను. మీ రక్కడికి యిప్పుడే వెళ్ళకండి."

"మా అమ్మా తమ్ముళ్ళూ"

"వాళ్ళని సురక్షితంగా మీ దగ్గరకి మేం చేరుస్తాం. మీరు సరేనంటే అందుకు ఇప్పుడే యేర్పాట్లు చేస్తాను."

సరళ గుండె దడదడలాడసాగింది.

ఈ క్షణంలో నిర్ణయించుకోవటం యెంత కష్టం. యేం జరిగినా ఆ భగవంతుడే దిక్కు అనుకుని "మీరు వెళ్ళకండి. మీ రెవరినైనా పంపండి" అంది గోవిందరావు సివ్వాడు.

గోవిందరావు సరళని తను చూసిన గదిలో దించి వెళ్ళిపోయాడు

5

సాయంకాలమైనా గోవిందరావు తిరిగి రాలేదు. సరళ గుండెల్లో రైళ్ళు పరుగెడుతూన్నాయి. తల్లికి తెలియకుండా ఇంట్లోనించి రావటమేకాక వారిని కూడా రప్పించే ప్రయత్నం యే పరిస్థితులకి దారితీస్తుందో ఆలోచించకుండా తను త్వరపడిందేమో యిదే విషయం సరళని వేధిస్తోంది. గోవిందరావు తల్లి అన్నం తెచ్చిపెట్టింది సరళకి కడుపులో ఆకలివున్నా ముద్ద గొంతు దిగటంలేదు. మనసులో ఒకటే ఆవేదన.

రాత్రి పదిగంటలు గడిచిన తర్వాత గోవిందరావు రాలేదు కానీ అతని స్నేహితులు నలుగురు వచ్చారు.

"సరళగారూ మీ అమ్మనీ ఇద్దరు తమ్ముళ్ళనీ ఆ పాత బస్తీనుంచి బైటకి తీసుకురాగలిగాం. మా స్నేహితుల ఇంట్లో వుంచాం. రేపు వుదయం ఇక్కడికి తీసుకువస్తాం" అని చెప్పారు.

"మా వాళ్ళని యెలా తీసుకురాగలిగారు."

"మీకు యాక్సిడెంట్ అయిందనీ,హాస్పటల్లో వున్నారనీ చెప్పి యెక్కడున్న వాళ్ళని అక్కడునుంచే తప్పించి తీసుకువచ్చాం. అయితే ఆ ఇంట్లోని మీ సామా

మలు తీసుకురాలేం. దానికి మీరు ఆశ వదులుకోవల్సిందే "

"అవిపోతే ఫర్లేదుగానీ ఆయన యేరీ."

మా మాటలు అందరూ నమ్మినా నీలకంఠం నమ్మలేదు. అనుమానించి ప్రతిఘటించాడు. ఆ ఘర్షణలో మా కన్నా గోవిందరావుకి మరీ దెబ్బలు తగిలినాయి. యే డాక్టరూ కట్లు కట్టటానికి ముందుకు రావటంలేదు. అర్ధరాత్రి కదూ. యింక ఆసుపత్రికి తీసుకువెళ్ళవల్సిందే. అక్కడికి వెళ్ళేముందు మిమ్మల్ని ఒక్కసారి కల్సుకోవాలని వస్తున్నాడు. అదుగో"

గోవిందరావు వళ్ళంతా రక్తం. యిద్దరు స్నేహితుల ఆసరాలో నిల్చోలేకపోతున్నాడు. సరళ అతన్ని గట్టిగా పట్టుకుని యేడవసాగింది.

"నేనే దీనికంతకీ కారణం. నేనే నేనే. మీరు యెందుకు వెళ్ళారు ఆ దుర్మార్గుడి దగ్గరికి "

మంచివాళ్ళకి మంచివాళ్ళంగా వుండాలి సరళా. రాక్షసులకి రాక్షసత్వంతోనే జవాబు చెప్పాలి ఆ కిరాతకుడి కీలు కీలూ విరకొట్టేశాము. ప్రాణం పోకుండా జీవితాంతం బాధపడేలా చేసి వచ్చాము. యిలా చేయటం చట్టంప్రకారం నేరం అని నాకు తెల్సు అయితే గత్యంతరంలేక నీలకంఠంలాంటి కిరాతకుడు యింకెవరికీ అపకారం చేయకుండా చేయవల్సివచ్చింది. యిందుకు నేను బాధపడను భయపడను. నేను పోలీసులదగ్గరకి వెళ్ళిపోతున్నాను జరిగినదంతా చెప్తాను. సరళా నువ్వు నీవాళ్ళు శాంతిగా గంజినీళ్ళయినా సరే ప్రశాంతంగా తాగి బ్రతకండి. చట్టం యే శిక్ష విధిస్తే అది శిరసావహిస్తాను. వెడుతున్నాను సరళా మళ్లా తిరిగి రాగలిగితే మనం కల్సి బ్రతుకుదాం"

గోవిందరావు స్నేహితులని వదిలి ఆటోయెక్కి వెళ్ళిపోయాడు. సరళ శిలా విగ్రహంలా నిలబడిపోయింది. గోవిందరావు తిరిగి వస్తాడన్న ఆశ యే మూలో మనసులో కదులుతోంచే కన్నీళ్ళు తుడుచుకుంటూ వుండిపోయింది.